క్లుప్తంగా

ఘనంగా ఎల్లమ్మ తల్లి పండగ



అమ్మవారి సన్నిధిలో భక్తులు

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు పెద వాల్తేరు గ్రామం మద్ది వారి పెద్దిల్లు ఆధ్వర్యంలో సెక్టార్ 5 ఎంవీపీ కాలనీలో ఎల్లమ్మ తల్లి పండగ మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మద్ది అప్పలరాజు రెడ్డి, మద్ది ప్రసాద్ రెడ్డి, మద్ది లక్ష్మణ్ రెడ్డి, మద్ది రమేష్ రెడ్డి మద్ది అప్పల రెడ్డి, మద్ది గుర్నాథ్ రెడ్డి, అప్పల రెడ్డి తదితర భక్తులు, మద్ది వారి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీదేవికి అష్టోత్తర సేవ



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ దేవి

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో కొలువైన శ్రీలక్ష్మీ దేవి అమ్మవారికి అష్టోత్తర సేవ బుధవారం నిర్వహించారు. 108 కలశాలతో అత్యంత వైభవంగా ఈ సేవ జరిపారు. ఇందులో భాగంగా పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసములతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన తామర పువ్వులు, పలు రకాల సుగంధ పుష్పాలతో పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల శ్రేయస్సే లక్ష్యం



కార్మిక కుటుంబాలకు మంజూరు పత్రాలు అందిస్తున్న షిప్‌యార్డ్ చైర్మన్ హేమంత్‌ఖత్రి

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా సంస్థ పనిచేస్తుందని షిప్‌యార్డ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్‌ఖత్రి అన్నారు. షిప్‌యార్డ్‌కాలనీలో ఆధునికీకరణ చేసిన కార్మికుల నివాస గృహాలను బుధవారం ఆయన పునః ప్రారంభించారు. కార్పొరేట్ ప్లానింగ్ డైరెక్టర్ జేపీ గుప్త మాట్లాడుతూ మహిళా దినోత్సవం రోజున కార్మిక కుటుంబాలకు ఇళ్లు అప్పజెప్పడం ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో షిప్‌యార్డ్‌కు మరిన్ని ఆర్డర్లు రాబోతున్నాయని, గుర్తింపు యూనియన్ సలహాల మేరకు కాలనీ అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఉన్నతాధికారులు, గుర్తింపు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ. ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిపారు. ఉభయ దాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సమాజాన్ని తీర్చిదిద్దేది మహిళలే

- అన్ని రంగాల్లో వారి సేవలు అద్వితీయం
- కొనియాడిన వక్తలు
- వేడుకగా మహిళా దినోత్సవం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మేయర్ హరివెంకట కుమారి



ఆకాశవాణి కేంద్రంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు, అధికారులు



సత్కరించిన మహిళా ఉద్యోగినులతో పీడీ పాపునాయుడు తదితరులు

ఎంవీపీకాలనీ: సమాజాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దగల సత్తా మహిళలకే ఉందని జీవీఎంసీ యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పాపునాయుడు అన్నారు. అన్ని రంగాల్లో పురుషులకు దీటుగా రాణిస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శివాజీ పార్కులో బుధవారం నిర్వహించిన వేడుకల్లో జోన్-3, జోన్-4 ఉద్యోగినులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార, రక్షణ, సాంకేతిక రంగాల్లో వారు చూపుతున్న తెగువ గర్వకారణమన్నారు. అయితే కుటుంబ సభ్యుల నుంచి మగవారికి లభించే ప్రోత్సాహం మహిళలకు లభించడం లేదన్నారు.

మహిళలను ప్రోత్సహించడంలో సమాజ దృక్పథం, ఆలోచనా విధానం మారాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడం, మహిళ చైతన్యం, సమీకరణలలో యూసీడీ మహిళా సిబ్బంది నిర్వహిస్తున్న పాత్రను కొనియాడారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన మ్యూజికల్ చైర్, అంత్యాక్షరి, టగ్ ఆఫ్ వార్, నృత్య పోటీల్లో ఉద్యోగినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మెడికల్ క్యాంపులో హెల్త్ చెకప్ చేయించుకున్నారు. కార్యక్రమంలో డీపీవోలు సూర్యకళ, రామలక్ష్మి మెడికల్ ఆఫీసర్ మనస్వి, జోన్-3, జోన్ 4 ఏపీడీలు, సీవోలు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కోవిడ్ సమయంలో మహిళా వైద్యుల సేవలు భేష్

అరిలోవ: రామ్‌నగర్ కేర్ ఆస్పత్రిలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ మహిళా వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కోవిడ్ సమయంలో మహిళా వైద్యులు, సిబ్బంది ఎనలేని సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. దేశ రక్షణ రంగంతో పాటు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించడం శుభ సూచికమన్నారు.

ఆకాశవాణి కేంద్రంలో..

విశాఖ ఆకాశవాణి కేంద్రంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రాంగణంలో మహిళలకు రంగవల్లులు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కె.ఇందిర, జె.కృపవరం, బి.పావని, తదితరులు పాల్గొన్నారు.

పశు సంవర్థకశాఖ కార్యాలయంలో..

మద్దిలపాలెం: పశు సంవర్థకశాఖ ఆధ్వర్యంలో ఇసుకతోటలోని పశువైద్యశాలలో బుధవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. పశు సంవర్థకశాఖ జేడీ రామకృష్ణ, డీడీ కరుణ్‌కుమార్, విశ్రాంత డీడీ నాగమణి ముఖ్యఅతిథులుగా హాజరై, కేక్ కట్ చేశారు. శాఖలో పని చేస్తున్న మహిళా అధికారులు, ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు.

సాగర తీరంలో ర్యాలీ

బీచ్‌రోడ్డు: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సాగరతీరంలో ర్యాలీ నిర్వహించారు. అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో అపోలో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ శివ నాగేంద్ర రెడ్డి, కార్యదర్శి పి.రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ సారథ్యంలో..

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో వైద్య రంగంలో విశేష సేవలందించిన వారిని ఘనంగా సత్కరించారు. వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ సత్యవతి మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, జె.సి.నాయుడు, రమణి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో...

రామ్‌నగర్‌లోని లయన్స్ క్లబ్‌లో నిర్వహించిన వేడుకలకు నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

బాలికల గృహంలో ..

ఆరిలోవ: రూరల్ మండల కార్యాలయం దరి ప్రభుత్వ బాలికల గృహంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ రాధ, గృహం సూపరింటెండెంట్ ఎ.వి సునీత, సిబ్బందితో కలసి కేక్ కట్‌చేశారు. సీఆర్‌పీఎఫ్ ప్రతినిధులు శకుంతల, ప్రవీణ, గృహం సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో ..

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాలలో మహిళా దినోత్సవం నిర్వహించారు. వేడుకల్లో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వీసీ ఆచార్య నిరూపారాణి , కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు ప్రసంగించారు. కార్యక్రమంలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ నిర్వాహకులు శ్రీవాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రత్నభారతి, అకడమిక్ కో ఆర్డినేటర్ సిహెచ్. లలిత, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ రవిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన వసతిగృహంలో..

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని గిరిజన వసతి గృహంలో గిరిజన ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో వసతి గృహ విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. స్కిట్లు, నృత్యాలతో అలరించారు. అనంతరం గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ మధుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కుల రామారావు, ముఖ్య సలహాదారు కిముడు రామారావు, దేవర వేణు, లోవరాజు తదితరులు వసతి గృహం వార్డెన్ ఝాన్సీని సత్కరించారు.

- బీజేపీ కార్యాలయంలో పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాతరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు, విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు. పలువురు మహిళా నాయకులను సత్కరించారు.
- వాల్తేర్ డిపో వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద వాల్తేరులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పండరీబాయిని సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జేఎం నాయుడు, రీజనల్ కమిటీ అధ్యక్షుడు అల్లు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.
- హనీ గ్రూప్ లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థలోని మహిళలంతా ఆటపాటలతో సంబరాలు చేసుకున్నారు. సంస్థ సీఎండీ ముక్క ఓబుల్ రెడ్డి వారికి వెండి కానుకలు అందజేశారు. హనీ గ్రూప్ లో మహిళలకు అవకాశాలు కల్పించి వారి ఉన్నతిని కోరుకుంటామని ఓబుల్ రెడ్డి తెలిపారు.



మహిళ దినోత్సవంలో హనీ గ్రూప్ సభ్యులు



కృష్ణా కళాశాలలో మాట్లాడుతున్న నిరూపారాణి



పశుసంవర్థక శాఖ కార్యాలయంలో..



మహిళ నాయకులను సత్కరిస్తున్న జీవీఎల్ నరసింహారావు తదితరులు



వార్డెన్‌ను సత్కరిస్తున్న గిరిజన ఐక్యవేదిక ప్రతినిధులు

వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



శ్రీకృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు జీవీఎంసీ 13వ వార్డులో బుధవారం ప్రచారం చేపట్టారు. పట్టభద్రులు ఉన్న ఇళ్లకు వెళ్లి సీతంరాజు ఫొటోతో ముద్రించిన కరపత్రాలు అందజేశారు. ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు కెల్ల సత్యనారాయణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, ప్యాడ్‌లు అందజేస్తున్న ఉదయ సుందర్

ఆరిలోవ: శ్రీకృష్ణాపురంలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను సామాజిక కార్యకర్త కోలపల్లి ఉదయ సుందర్ బుధవారం అందజేశారు. పరీక్ష ప్యాడ్, పెన్సిల్, పెన్, డ్రాయింగ్ మెటీరియల్‌తో కూడిన కిట్లను ఇక్కడ విద్యార్థులకు అందజేశారు. గురుకులంలో మిగిలిన తరగతుల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు జాగ్రత్తలు చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని తోటివారికి సహాయం అందించగలిగే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గురుకులం ఉపాధ్యాయులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పుష్పయాగం

సింహాచలం: సింహగిరిపై ప్రాచీన రామాలయంలో నిర్వహిస్తున్న సీతారామాలయ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం రాత్రితో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారికి పుష్పయాగం విశేషంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్ఠంపజేసి షోడశోపచార పూజలు చేశారు. వివిధ రకాల పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థానంలో బుధవారం అమ్మవారి జన్మ నక్షత్రం (ఉత్తరా నక్షత్రం) పురస్కరించుకుని ఆయుష్ హోమం జరిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి నెలా ఉత్తరా నక్షత్రం రోజున ఉదయం 9 గంటలకు నిర్వహించే ఆయుష్ హోమంలో పాల్గొనదలిచే భక్తులు రూ. 2,516 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 వాట్సాప్ నెంబరుకు పంపవచ్చు. కార్యక్రమంలో ఈవో శిరీషతో పాటు ఏఈవో వెంపలి రాంబాబు పాల్గొన్నారు.

నాటి ఉద్యమం.. నేటి తరానికి స్ఫూర్తి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదం నేపథ్యంగా జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు అన్నారు. విశాఖ ఉక్కును విక్రయించరాదని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్ష 704వ రోజు దీక్షలో కాంట్రాక్ట్ కార్మికులు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్ప దన్నారు.

ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోదీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తే దేశంలో నెంబర్ వన్ పరిశ్రమగా ఎదుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ హెచ్‌పీసీఎల్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు తాతబాబు, వై.నర్సింగరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మల్కాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం హెచ్‌పీసీఎల్ కంపెనీలో పనిచేసే మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సైబర్ క్రైం సీఐ కె.భవానిప్రసాద్ ఆర్ అండ్ బీ దరి హోటల్ ఫెయిర్‌ఫీల్డ్ మారియట్ హోటల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియాలో మహిళలపై జరుగుతున్న సైబర్ నేరాలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులతో ఎటువంటి వ్యక్తిగత విషయాలను పంచుకోవద్దని, అటువంటి వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అలా జరిగినప్పుడు తక్షణమే వాటిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఎటువంటి సైబర్ ఫిర్యాదులకైనా 1930 నంబర్‌కు వెంటనే కాల్ చేయాలని సీఐ సూచించారు.

మదర్ ఇండియా ట్రస్ట్‌కు కొత్త కార్యవర్గం

సీతంపేట: ఎన్జీజీవోస్ కాలనీలో ఏర్పాటు చేసిన మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు నూతన కార్యాలయాన్ని బుధవారం ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు మళ్ల వెంకటరావు ప్రారంభించారు. ట్రస్టు ఏర్పాటై మూడేళ్లు పూర్తయిన సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ట్రస్టు చైర్మన్‌గా మళ్ల వెంకటరావు, గౌరవాధ్యక్షుడిగా బండి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఇందిరా ప్రియదర్శిని, ప్రధాన కార్యదర్శిగా కందాల ప్రభాకర్‌రావు, ఉపాధ్యక్షుడిగా రాపేటి కృష్ణ, కార్యదర్శిగా కనిశెట్టి అప్పారావు నియమితులయ్యారు. సాంస్కృతిక విభాగానికి అధ్యక్షురాలిగా రెండో సారి సత్యమాధవి, మహిళా విభాగం గౌరవాధ్యక్షురాలిగా మళ్ల లక్ష్మి ఎన్నికయ్యారు. మహిళా ప్రధాన కార్యదర్శిగా కనకదుర్గ, కార్యదర్శిగా జెస్సీ, ఉపాధ్యక్షురాలిగా పిల్ల రేణుక నియమితులయ్యారు. కొత్త కార్యవర్గం మూడేళ్ల పాటు అధికారంలో ఉంటారని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

45 టన్నుల ఇసుక సీజ్



సీజ్ చేసిన ఇసుకతో అధికారులు

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ సామయ్యవలస సమీపాన గోస్తనీ నది ఒడ్డున ఎడ్లు బళ్లతో బుధవారం అక్రమంగా తరలిస్తున్న 45 టన్నుల ఇసుకను ఎస్ఈబీ సీఐ రామకృష్ణ, భూగర్భ గనుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ షేక్ సుభాని పట్టుకుని సీజ్ చేశారు. ఇసుక రవాణా చేస్తున్న వారిని గుర్తించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయాలని నిర్ణయించారు. దాడుల్లో భూగర్భ గనుల శాఖ సిబ్బంది డి.రమేష్, ఎన్.మధు, వీఆర్ఏలు రాజు, తాతయ్య పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యమం మరింత ఉధృతం

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కార్మికులు చేస్తున్న ఉద్యమానికి ఎన్నో ఒత్తిళ్లు, మరెన్నో అడ్డంకులు సృష్టించినా ఉక్కు సంకల్పం ముందు నిలబడలేవని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. పైగా రెట్టించిన ఉత్సాహంతో ఉద్యమం ఉధృతం చేస్తున్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 755వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో బ్లాస్‌ఫర్నేస్ విభాగానికి చెందిన కార్మికులు కూర్చున్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఎంతో గొప్ప చరిత్ర కలిగిన స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే ఒప్పుకోబోమన్నారు. దీక్షలో నాయకులు పాల్గొన్నారు.

ఆనందాల హోలీ



సమావేశంలో మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు



చినగదిలిలో యువకుల హోలీ సందడి

ఆరిలోవ: ఆరిలోవలో బుధవారం హోలీ సందడి నెలకొంది. హోలీ సందర్భంగా యువకులు వీధుల్లో రంగులు రాసుకొని సరదాగా గడిపారు. కోడి గుడ్లు విసురుకుంటూ, వివిధ రంగులు ముఖానికి, తలకు ఒకరికొకరు రాసుకొన్నారు. ఆరిలోవకాలనీ, దుర్గాబజార్, టి.ఐ.సి పాయింట్, పార్వతీనగర్, బాలాజీనగర్, చినగదిలి, పెదగదిలి, రవీంద్రనగర్, ఆదర్శనగర్‌లో యువకులు వీధుల్లో పరుగులెడుతూ సందడి చేశారు.

జీవీఎల్ నివాసంలో ఘనంగా వేడుకలు

ఎంవీపీ కాలనీ: బీచ్‌రోడ్డులోని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు నివాసంలో బుధవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జీవీఎల్‌తోపాటు అతని సతీమణి మైథిలి, పలువురు బీజేపీ నాయకులు, ఉత్తరాది రాష్ట్రాల ప్రజల సమక్షంలో వేడుకల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు, రంగు నీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. తెలుగు, హిందీ గీతాలకు నృత్యాలు చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. ఈ సందర్భంగా జీవీఎల్ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మంలో హోలీకి ప్రత్యేక స్థానం ఉందని, కొత్త సీజన్‌కు స్వాగతం పలుకుతూ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. విశాఖలో నివసిస్తున్న ఉత్తరాది ప్రజలు ఏటా ఘనంగా హోలీ జరుపుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ వల్లే పెట్టుబడులు

భీమునిపట్నం: విశాఖలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే భారీ పెట్టుబడులు వచ్చాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఇక్కడి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.13 లక్షలకుపైగా పెట్టుబడులు రావడం, దిగ్గజ పారిశ్రామికవేత్తలు సమ్మిట్‌కు రావడంతో ప్రతిపక్షాలకు దిక్కుతోచకుండా పోయిందన్నారు. విశాఖ పరిపాలన రాజధాని కానున్న నేపథ్యంలో అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందడంతోపాటు వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. భారీ పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరినప్పటికీ కొందరు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మడం ఎప్పుడో మానేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ముత్తంశెట్టి మహేష్, యలమంచిలి సూర్యనారాయణ, నాలుగో వార్డు కార్పొరేటర్ దొలుపల్లి కొండబాబు, ఎస్.కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన అనంతుని కల్యాణోత్సవాలు



అనంతుని ఉత్సవ విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న అనంతుని కల్యాణోత్సవాలు బుధవారం రాత్రి శ్రీపుష్పయాగంతో ముగిశాయి. ఇందులో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి కుంతీ మాధవ స్వామి ఆలయం చుట్టూ 12 సార్లు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలోకి తీసుకెళ్లి ఉభయ దేవేరులతో అనంతునికి శ్రీ పుష్పయాగం నిర్వహించారు. 18 రకాల పుష్పాలు సమర్పించి ఈ యాగం జరిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో ఎస్.నానాజీ బాబు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, తాలాడ పద్మనాభం, తాలాడ పైడిరాజు పాల్గొన్నారు.